సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 7 । అక్టోబర్ । 2023



వలిసె సాగుపై శిక్షణ
మాకవరం పంచాయతీ మేబ గ్రామంలో గిరిజన రైతులకు వలిసెసాగుపై శుక్రవారం వ్యవసాయశాఖ శిక్షణ ఇచ్చింది. 8లో



చట్టాలపై అవగాహన అవసరం
చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అరకులోయ కోర్టు జడ్జి శివకిరణ్ సూచించారు. 8లో



వేటగాళ్ల దాడిలో గొర్రగేదె మృతి
వేటగాళ్లు దాడిలో గాయపడి వారి నుంచి తప్పించుకున్న గొర్ర గేదె శుక్రవారం లోయలోపడి మృతి చెందింది. 8లో

న్యూస్‌రీల్

మన్యంలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- చింతపల్లిలో 16.5, మినుములూరులో 18 డిగ్రీల నమోదు
- దట్టంగా కురుస్తున్న మంచు



వంతాడపల్లి తోటల్లో మంచు తెరలను చీల్చుకుంటూ వస్తున్న సూర్యకిరణాలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు దట్టంగా కురుస్తోంది.వేకువజామున చలిగాలులు నెల కొంటున్నాయి. ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతున్నాయి. శుక్రవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.5, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 18డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉదయం ఏడుగంటల వరకు పొగమంచు కురిసింది. పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి తోటల నుంచి ఘాట్ వరకు మంచు తీవ్రత అధికంగా ఉంది. మంచు తెరలను చీల్చుకుంటు సూర్యోదయం అందాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.

బంతి రైతుకు నిరాశ

- సీజన్ ప్రారంభంలోనే ధర పతనం
- బుట్ట రూ.30కు కొనుగోలు చేసిన వ్యాపారులు



పాడేరు పాతబస్టాండ్ మార్కెట్‌కు బంతి పూలను తీసుకువచ్చిన గిరి రైతులు

సాక్షి,పాడేరు: ఈ ఏడాది కూడా ముందుగానే సీతమ్మకాటుక (చిన్నబంతి) బంతి పూల దిగుబడులు ప్రారంభమయ్యాయి. అయితే పూల ధరలు మాత్రం రైతులను నిరాశపరుస్తున్నాయి. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లోని గిరిజనులు సుమారు 100 ఎకరాల్లో చిన్న బంతి రకాన్ని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో విరగపూశాయి. స్థానిక పాతబస్టాండ్ మార్కెట్‌కు శుక్రవారం భారీగా బంతిపూలను తీసుకువచ్చారు. అయితే ధర లేక నిరాశకు గురయ్యారు.మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కారుచౌకగా కొనుగోలు చేశారు. బుట్ట పూలకు రూ.30కు మించి ధర పలకలేదు. కనీసం రవాణా చార్జీలు కూడా రాలేదని బంతి రైతులు వాపోయారు.

నేడు అరకులోయలో ఎమ్మెల్సీ రవిబాబు పర్యటన



అరకులోయ టౌన్: శాసన మండలి సభ్యుడు డాక్టర్ కుంభా రవిబాబు శనివారం అరకులోయలో పర్యటించనున్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులయ్యాక తొలిసారిగా వస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలికేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఆయన స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

విద్యార్థిని చంద్రలేఖకు సత్కారం



చంద్రలేఖను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: ఐరాస సదస్సులో మన రాష్ట్రం విద్యా ప్రమాణాలను వివరించిన మోతుకూరి చంద్రలేఖ పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని పలువురు అభినందించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ఆమెను శుక్రవారం స్థానిక సచివాలయంలో జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి,సర్పంచ్ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు.పేద కుటుంబంలో పుట్టి కస్తూర్బా బాలికల విద్యాలయంలో చదువుతూ ఎటపాకకు గుర్తింపు తేవడం అభినందనీయమని కొనియాడారు. ఈకార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కురినాల వెంకట్, కొవ్వూరి రాంబాబు,కార్యదర్శి పద్మజ, వైద్యులు ప్రత్యూష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో 1 నంబర్



- రోజుకు సగటున 4 నిమిషాలు మాత్రమే పవర్ 'కట్'
- సర్కిల్ పరిధిలో తగ్గుతున్న సరఫరా అంతరాయం
- 2 నెలలుగా 9 నిమిషాలు.. అక్టోబర్‌లో నాలుగు నిమిషాలు మాత్రమే
- పునరుద్ధరణ పనుల్లో వినూత్న ప్రణాళికలు
- ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దూకుడుగా విశాఖపట్నం సర్కిల్

సాక్షి, విశాఖపట్నం : గాలి వీచిందా..? అయితే కరెంట్ గోవిందా.? వర్షం పడుతోందా..? టార్చ్‌లైట్స్, చార్జింగ్ లైట్స్ వెతుక్కోవాల్సిందే. ఇంకేముంది.. గంటల తరబడి కరెంట్ రాదు. ఏంటో ఈ పవర్ సప్లై.. రోజులో గంటల తరబడి కరెంట్ ఉండటం లేదు. ఇదీ ఒకప్పుడు వినియోగదారుల నుంచి తరచూ వినిపించిన మాట.. కాలం మారింది.. కరెంట్ సరఫరాలోనూ మార్పులు వచ్చాయి. సరఫరా అంతరాయం మారింది. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విశాఖ సర్కిల్ నిరంతరం శ్రమిస్తోంది. అందుకే సగటున పవర్ కట్‌ను రోజులో కేవలం 4 నిమిషాలకు మాత్రమే తగ్గించుకుంటూ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న సర్కిళ్లలో నంబర్ వన్‌లో కొనసాగుతోంది. విద్యుత్ సరఫరా విషయంలో విశాఖ దూకుడుగా వ్యవహరిస్తోందని సైదీ సైఫీ సూచీలే స్పష్టం చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో ఐదు సర్కిల్స్ ఉన్నాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం సర్కిల్స్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలే సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైదీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ). రోజూ ఆయా సర్కిల్స్ పరిధిలో ఎంత సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.? ఎంత సమయానికి పునరుద్ధరించారు.? ఇలాంటి వివరాలను ఎప్పటికప్పుడు గణిస్తూ సరాసరిని చూపిస్తుంటుంది. ఈ విషయంలో విశాఖ సర్కిల్ నంబర్‌వన్‌లో నిలిచింది. ఈ సర్కిల్ పరిధిలో 17,57,727 మంది వినియోగదారులున్నారు. ఇందులో 15,02,204 డొమెస్టిక్ కనెక్షన్లుండగా, 1,70,580 కమర్షియల్, 49,037 అగ్రికల్చర్, 30,632 ఇన్‌స్టిట్యూషనల్, 5,274 ఇండస్ట్రీస్ కనెక్షన్లున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సైదీ సైఫీ ర్యాంకింగ్‌ను ప్రకటిస్తుంది.

నాలుగు నిమిషాలు మాత్రమే..

2014–19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు సగటున 60 నుంచి 85 నిమిషాల వరకూ విద్యుత్ అంతరాయం ఉండేది. అంటే 24 గంటల్లో కనీసం గంటకు పైగా కరెంట్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవి. పంపిణీ విషయంలో పక్కాగా వ్యవహరిస్తూ ఆధునిక సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకుంటూ సరఫరా అంతరాయాన్ని తగ్గించారు. గంట ఉండే అంతరాయం క్రమంగా నిమిషాలకు చేరుకుంది. ఇప్పుడు కేవలం 4 నుంచి 10 నిమిషాలు మాత్రమే రోజులో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సగటున రోజుకు 9 నిమిషాలు మాత్రమే సరఫరాకు అంతరాయం ఉండగా.. ఈ నెలలో కేవలం 4 నిమిషాలు మాత్రమే సగటు ఇంట్రప్షన్ ఉన్నట్లు సైదీ సైఫీ నివేదికలో స్పష్టమైంది.

నంబర్ వన్ ర్యాంకులో... విశాఖ సర్కిల్

గత కొద్ది నెలలుగా విశాఖ సర్కిల్ సైదీ సైఫీ ర్యాంకింగ్‌లో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయాలు లేకుండా అందించడంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది సఫలీకృతమవుతున్నారు. తర్వాత ర్యాంకింగ్‌లో రాజమండ్రి, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం ఉన్నాయి. కేవలం సర్కిల్ మాత్రమే కాకుండా.. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఇంట్రప్షన్ తగ్గిస్తూ సరఫరా అందిస్తున్నారు. విశాఖ సర్కిల్‌లో నాలుగు నిమిషాలు మాత్రమే ఉండగా రాజమహేంద్రవరంలో 8 నిమిషాలు, శ్రీకాకుళం పరిధిలో 10, విజయనగరంలో 13, ఏలూరులో 16 నిమిషాలు మాత్రమే రోజుకు సగటున విద్యుత్ కోతలు జరుగుతున్నట్లు సైదీ సైఫీ ర్యాంకింగ్స్‌లో స్పష్టమైంది.

విశాఖ సర్కిల్‌లో కనెక్షన్లు

మొత్తం:	17,57,727 మంది
డొమెస్టిక్ :	15,02,204
కమర్షియల్:	1,70,580
అగ్రికల్చర్:	49,037
ఇన్‌స్టిట్యూషనల్:	30,632
ఇండస్ట్రీస్:	5,274

ఏపీఈపీడీసీఎల్ సర్కిల్స్ పరిధిలో సైదీ సైఫీ పెర్ఫార్మెన్స్ వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	రోజులో సరఫరా సమయం(గం.లలో)	అంతరాయ సమయం (ని.లలో)	ర్యాంకు
విశాఖపట్నం	933	23:55:42	4.17	01
రాజమహేంద్రవరం	953	23:51:12	8:47	02
శ్రీకాకుళం	353	23:49:08	10:51	03
విజయనగరం	425	23:46:09	13:50	04
ఏలూరు	1158	23:43:21	16:38	05



ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన లోపాలను సరిచేస్తూ..

మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం



ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం. వినియోగదారులకు ఇచ్చే విద్యుత్‌ను నాణ్యంగా ఎలా అందించాలనే అంశంపై సీఎండీ సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. దానికనుగుణంగా మార్పులు చేస్తూ అంతరాయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం సగటున 4 నిమిషాలున్న ఇంట్రప్షన్‌ను క్రమంగా తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విపత్తుల కారణంగా ఏదైనా అవాంతరాలు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవలే ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌ను రూపొందించాం. మిగిలిన చోట్లా అదే తరహా టెక్నాలజీ వస్తే ఈ అంతరాయం మరింత తగ్గించగలం.

– ఎల్ మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

సీఎస్ జవహర్‌రెడ్డి పర్యటనతో జిల్లాకు మేలు

- రూ.20 కోట్ల నిధులు విడుదల
- ఆయనకు కృతజ్ఞతలు తెలిపిన కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గతనెల 9వతేదీన జిల్లా పర్యటన వల్ల ఎంతో మేలు జరిగిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అభివృద్ధిపై సీఎస్ సమీక్షించిన అనంతరం జిల్లాలో భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల సమస్యల పట్ల ఆయన చలించారని పేర్కొన్నారు. జిల్లా పర్యటన అనంతరం 15రోజుల వ్యవధిలోనే ఆయన జిల్లాలో ప్రాధాన్యేతర నిర్మాణాలకు సంబంధించి రూ.20 కోట్లు విడుదల చేశారన్నారు. వీటితో 22 మండలాల్లో ఆయా పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించినట్టు తెలిపారు. ముంచంగిపుట్టు, చింతపల్లి, వై.రామవరం తదితర మారుమూల ప్రాంతాలతో పాటు సీలేరుకు రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రాధాన్యేతర పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.71 కోట్లు చెల్లించామని చెప్పారు. సీఎస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన పెండింగ్ బిల్లులకు సంబంధించి తొందరలోనే మంజూరు చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యత, ప్రాధాన్యేతర పనులను కాంట్రాక్టర్లు నిధుల సాకుతో నిలిపివేయవద్దని ఆయన సూచించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, వాటికి త్వరితగతిన బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

వ్యవసాయ దిగుబడులు ప్రారంభం

- ఆశాజనకంగా ధరలు
- గిరి రైతులకు ఊరట



సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ, కూరగాయల ఉత్పత్తుల దిగుబడులు ప్రారంభమయ్యాయి. పాడేరు పాతబస్టాండ్‌లో శుక్రవారం జరిగిన సంతకు గిరిజన రైతులు టమాటా, కొత్త అల్లం, నాగలిదుంపలు, చేమ దుంపలను తీసుకువచ్చారు. నాగలి దుంపలు కిలో రూ.16కు విక్రయించారు. టమాటా 10 కిలోల బుట్ట రూ.600, 10 కిలోల చేమదుంపలు రూ.300 ధర పలికింది. కొత్త అల్లానికి మంచి ధర లభించింది. సీజన్ ప్రారంభంలోనే కిలో రూ.60 ధర లభించడం గిరి రైతులకు ఊరటనిచ్చింది.

గ్రామ సచివాలయ వ్యవస్థతోనే సుపరిపాలన

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



నుర్మతిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సుపరిపాలన సాధ్యమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో నుర్మతిలోగ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం వల్ల సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన అవస్థలు తప్పాయన్నారు. సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ కె.పద్మ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్‌లు సూరిబాబు, కిముడు రాంబాబు, లసంగి మాలన్న, సీదరి కొండబాబు, ఎస్ రామకృష్ణ, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూరుబాబు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ జంక్షన్ వద్ద ఈనెల 15 నుంచి 24 వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి పందిరిరాటను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ప్రతిష్ఠించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి,గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ, జనసేన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: నుర్మతి గ్రామ సచివాలయ పరిధిలోని వాకపల్లిలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వేసి ఆహ్వానించారు. టీడీపీ, జనసేనకు చెందిన ఎంబరి నాగరాజు, కొర్రా స్వామినాయుడు,బూటారి చిన్నయ్య, గెమ్మెలి రాజారావు, ఎంగ్రపల్లి పండన్న, వావిడి పూర్ణచంద్రరావు, తల్లే చితుకన్న, కె సన్యాసయ్య, తల్లేరావు, వెంబటి రామారావు, మూటారి భీమయ్య, కుసంగి పంతులురావు, పూజారి జుంబన్న, వెంబరి మత్స్యలింగం పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాంతి రామకృష్ణ, అంద్రయ్య, బాలయ్య, సచివాలయ కన్వీనర్లు సూర్య ప్రకాష్ నాయుడు, రమణ, లక్ష్మీపడాల్ పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై

ప్రత్యేక నిఘా

అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి రూరల్: గంజాయి అక్రమ రవాణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు.శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా గిరిజన గ్రామాల్లో గంజాయి నిర్మూలించగలిగామన్నారు. దానికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి మొక్కలు, విత్తనాలతో చేయూత అందిస్తున్నామన్నారు. ఏడాది కాలంగా పట్టుబడుతున్న గంజాయి ఒడిశా నుంచి వస్తుందన్నారు. దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని చెప్పారు. జిల్లాలో గంజాయి సాగు చేసినా.. రవాణాకు పాల్పడినా లేకుంటే గంజాయి మూఠా తో సంబంధం ఉన్న వారి ఎటువంటి సమాచారం 9381123100 నంబరుకు తెలియజేయాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయండి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో ఈకేవైసీ, ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ, ఓటరు సవరణ ప్రక్రియ, భూముల రీ సర్వే, కులధ్రువీకరణపత్రాలు జారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు పీఎం కిసాన్ అందించడమే లక్ష్యంగా వ్యవసాయాధికారులు పని చేయాలని సూచించారు. జిల్లాలో ఈకేవైసీ 88 శాతం పూర్తయిందని చెప్పారు. ఈనెల 13వతేదీలోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జీకేవీధి, పెదబయలు, అరకువ్యాలీ మండలాల్లో ఆర్వోఎఫ్ఆర్ భూముల డిజిటలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం వినతులను త్వరితంగా పరిష్కరించాలని సూచించారు. అడ్డతీగల మండలంలో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా తయారీకి సిద్ధం కావాలని సూచించారు. భూముల రీ సర్వే లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభంబన్సల్, డీఆర్వో పి.అంబేడ్కర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన

వినతులను స్వీకరించిన ఎస్పీ తుహిన్ సిన్హా



వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు రూరల్ : పోలీస్‌శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా వినతులు స్వీకరించారు. 2021లో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది రూ.లక్షలు వసూలు చేసి నకిలీ ఆర్డర్లు ఇచ్చి మోసగించారని హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన పి. జయలలిత, ఈశ్వరి తదితరులు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన కందుల విద్యాసాగర్, పాడేరు మండలం మినుములూరుకు చెందిన మినుముల సత్యనారాయణ, వెంకటరమణ పాత్రుడు, ఎం. రాజేశ్వరి, ఎం.పద్మ తదితరులు తమను మోసగించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత అక్టోబర్ ఒకటో తేదీన తనపై ముంచంగిపుట్టు జీటీడబ్ల్యూఏ పాఠశాల వార్డెన్ పలాసి గిరీష్, ఉపాధ్యాయుడు మధుసూదన్ దాడి చేసి గాయపరిచారని ముంచంగిపుట్టు గ్రామానికి డూరు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. స్పందనలో స్వీకరించిన మూడు ఫిర్యాదులను సకాలంలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

బాలుడి అదృశ్యం



చోడి అనిల్‌కుమార్

అడ్డతీగల: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ బాలుడు అదృశ్యమైనట్టు స్థానిక ఎస్‌ఐ ఎ.అప్పలరాజు శుక్రవారం తెలిపారు. అడ్డతీగల మండలం ధాన్యం పాలెం పంచాయతీ చిన్నమునకనగడ్డకి చెందిన మానసిక స్థితి సరిగ్గాలేని చోడి అనిల్‌కుమార్(15) అనే బాలుడు ఈనెల 4 న తన ఇంటి దగ్గర నుంచి వెళ్లిపోయినట్టు చెప్పారు. తిరిగి ఇంటికి చేరకపోవడంతో బాలుని తల్లి గంగమ్మ ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 00769, 63041 81609 అనే ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ అప్పలరాజు కోరారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ముసురుమిల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: ప్రాజెక్టులు, చెరువుల్లో చేపలు పెంపకం ద్వారా గిరిజన మత్స్యకార రైతులు ఆర్థికాభివృద్ధి చెందాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ముసురుమిల్లి, భూపతిపాలెం ప్రాజెక్టుల్లో శుక్రవారం ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మితో కలిసి ఆమె చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో రమేష్‌బాబు మాట్లాడుతూ ముసురుమిల్లి రిజర్వాయర్‌లో 72 వేలు, భూపతిపాలెం ప్రాజెక్టులో 60వేల చేప పిల్లలను విడుదల చేసినట్టు తెలిపారు. దిరిసినపల్లి దెయ్యాలగుమ్మి రిజర్వాయర్‌లో ఎనిమిది వేల చేప పిల్లలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త వీరాంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్ కోసు రమేష్‌బాబుదొర, ఎంపీటీసీ కుంజం వంశీ, ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



స్పందనకు తరలివచ్చిన గిరిజనులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జగనన్నకు చెబుదాం స్పందనకు తరలివచ్చిన గిరిజనులు
- 334 వినతులు సమర్పణ

హుకుంపేట: స్పందనలో స్వీకరించిన వినతులకు సంబంధించి సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి గిరిజనులు భారీగా తరలివచ్చారు. సుమారు 334 వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్ తదితర అధికారులు వినతులు స్వీకరించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. అధికశాతం రెవెన్యూ, సామాజిక సమస్యలకు సంబంధించి వినతులు ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులంతా వచ్చినందున సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశతో ప్రజలు వచ్చారని వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ సమస్య వెనువెంటనే పరిష్కరించేందుక అవసరమైన చర్యలు తీసుకుని కార్యక్రమం లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- హుకుంపేట మండలం సూకురు పంచాయతీ బిరిసింగికి చెందిన వంతాల పొట్టమ్మ మానసిక దివ్యాంగుడైన తన కుమారుడికి పింఛను మంజూరు చేయాలని కోరింది.
- రంగశీల పంచాయతీ ఒంటిపాక గ్రామానికి చెందిన గంజాయి బాలరాజు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. డిగ్రీ, ఐటీఐ చదువు కున్నందున ఉపాధి కల్పించాలని అర్జీ అందజేశాడు.
- మండల కేంద్రంలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని, ఆరోగ్య కార్యకర్త లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హుకుంపేట సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.
- ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ కులబేరుకు చెందిన కొర్ర ఉప్పమ్మ, చింతపల్లి మండలం తాజంగికి చెందిన గుండ్ల మంగ తమ కుమారులకు దివ్యాంగుడి పింఛను మంజూరు చేయాలని కోరారు.
- మంచంగిపుట్టు పనసపుట్టు పంచాయతీ టిక్రపడకు చెందిన పి.సునీత పనసపుట్టు జీటీడబ్ల్యూవో స్కూల్‌లో అటెండర్‌గా నియమించాలని అధికారులను కోరింది.
- సాగు చేస్తున్న పోడు భూమికి పట్టా ఇప్పించాలని బాకూరుకు చెందిన బాకురు రామరాజు అధికారులను కోరాడు.
- తీగలవలస పంచాయితీ కామయ్యపేట పరిధిలో పదివేల మంది జనాభా ఉన్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాం ఏర్పాటు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.



దివ్యాంగ చిన్నారిని కార్యక్రమానికి తీసుకొచ్చిన తాజంగి వాసులు

అవస్థలు తప్పాయి



జిల్లా స్థాయి అధికారులంతా మండల కేంద్రానికి వచ్చి స్పందన కార్యక్రమం నిర్వహించడం వల్ల సమస్యలు వారికి చెప్పుకునే అవకాశం ఏర్పడింది. లేదంటే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సి వచ్చింది. మండల కేంద్రంలో నిర్వహించడం వల్ల అవస్థలు తప్పాయి. – లక్కే ప్రభాకర్, బారపల్లి, హుకుంపేట మండలం

వలిసె సాగుపై శిక్షణ

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ మేబ గ్రామంలో ఏరువాకలో భాగంగా గిరిజన రైతులకు వలిసెసాగుపై శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త జగన్నాథం మాట్లాడుతూ సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. ఏవో శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

8న వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో 8వ తేదీన ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య భానుకుమార్ తెలిపారు. డాక్టర్ కె.ఈశ్వరరావు వైద్యసేవలందిస్తారని మరిన్ని వివరాలకు 9440191673 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బంగారు భవిష్యత్తుకు మళ్లీ జగనే సీఎం కావాలి



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలో నుర్మతి గ్రామ సచివాలయంలో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకునే బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై సచివాలయ గృహసారథులు, కన్వీనర్లు విస్తృతంగా అవగాహన కల్పించి, స్థానికులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కిందస్థాయి నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు మంది అవకాశమన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని ప్రతీ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు సాయం అందిన వివరాలతో కూడిన ప్రత్యేకమైన బోర్డును ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాల్లో ఆ బోర్డును ఆవిష్కరించాలన్నారు. ఇందులో భాగంగా కార్యక్రమం జరగనున్న ప్రాంతంలోని నాయకుని ఇంట్లో రాత్రి బస చేసి, వార్డు సభ్యుల నుంచి సచివాలయ కన్వీనర్ల స్థాయి వరకు సమావేశమై పథకాల అమలుతీరుపై చర్చించాలన్నారు. పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, సర్పంచ్ కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల దాడిలో గొర్రగేదె మృతి



గాయాలతో రోడ్డు దాటుతున్న గొర్రగేదె

మారేడుమిల్లి : వేటగాళ్లు దాడిలో గాయపడిన గొర్ర గేదె (అడవి దున్న)శుక్రవారం సాయంత్రం లోయలోపడి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే రోడ్డు మార్గంలో అడవిలోంచి గొర్రగేదె గాయాలతో రోడ్డుపైకి పరిగెత్తుకుంటూ వచ్చింది. అవతల వైపు వెళ్లేందుకు రోడ్డు దాటే ప్రయత్నంలో పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. అటువైపుగా వెళ్తున్న వాహనాదారులు, స్థానికులు దీనిని గమనించి స్థానిక అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారి సుమంత్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందింది. శరీరంపై బాణాలు గుచ్చుకొని ఉన్నందున వేటగాళ్ల దాడిలో గాయపడినట్టుగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గొర్రగేదె వయసు రెండున్నరేళ్లు ఉంటుందని వారు పేర్కొన్నారు. రెండున్నర ఏళ్లు ఉంటుందని తెలిపారు.

గిరి విద్యార్థుల్లో అపార ప్రతిభ

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



పతకాలు సాధించిన విద్యార్థులతో పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: గిరిజన విద్యార్థుల్లో అపార ప్రతిభ ఉందని, ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. నాసిక్‌లో జరిగిన జాతీయస్థాయి క్రీడల్లో బందపల్లి బాలురు ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కోసు లోకేష్ దొర, సీహెచ్ కల్యాణరావుదొర డబల్ డచ్ స్పీడ్‌లో పతకాలు సాధించారు. వీరు శుక్రవారం పీవోతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిశారు. ఇద్దరు విద్యార్థులను పీవో, సబ్‌కలెక్టర్ అభినందించారు. డీడీ జాన్‌రాజ్, ఏటీడబ్ల్యూవో రామ తులసి, హెచ్‌ఎం రాములు, పీడీ తిరుపతిరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అరకులోయ టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్థానిక కోర్టు జడ్జి ఎం.శివకిరణ్ సూచించారు. శుక్రవారం స్థానిక సీకాలనీలో యువతీ యువకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలు, హక్కులపై అవగాహనతోనే సమాజంపై బాధ్యత పెరుగుతుందన్నారు. యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత స్థాయిలో స్థిరపడేందుకు మంచి మార్గాల్లో నడుచుకోవాలని సూచించారు. ఎస్‌ఐ సంతోష్, న్యాయవాదులు మురళీమోహన్, ప్రభాకర్, సింహాచలం పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : టెన్త్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. టెన్త్‌లో నూరుశాతం మార్కులు సాధనే లక్ష్యంగా 50 మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు శుక్రవారం పరీక్ష నిర్వహించారు. దీనికి 107 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి 305 మంది హాజరయ్యారని పీవో తెలిపారు. వీరిలో ప్రతిభ ఆధారంగా 50 మందిని ఎంపిక చేసి 10/10 మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తామన్నారు. పాడేరు లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలల్లో వీరికి పరీక్ష నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ. కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమశాఖాధికారి ఎల్.రజిని పాల్గొన్నారు.

108 వాహనాల్లో ప్రసవాలు



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న సిబ్బంది



బిడ్డను బంధువులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

హుకుంపేట: సంతారి పంచాయతీ ఎగరూడి గ్రామానికి చెందిన వీ.రాధమ్మ అనే ఓ గర్భిణి 108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. గురువారం అర్ధరాత్రి ఆమెకు పురిటి నొప్పిలు రావడంతో కుటుంబీకులు 108కి సమాచారం అందించారు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో ఆమె మగబిడ్డను ప్రసవించింది.

మారేడుమిల్లి : 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణి శుక్రవారం ప్రసవించింది. దెందులూరు గ్రామానికి చెందిన నాగమణికి పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, రంపచోడవరం తరలిస్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ ప్రేమ్ కుమార్, పైలెట్ నాగేశ్వరరావు అమెకు ప్రసవం చేశారు. అమె మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి.బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా



సుబ్బారావు మృతదేహం

ఒకరి మృతి, 12 మందికి గాయాలు







ఆటో ప్రమాదంలో క్షతగాత్రులు

పెదబయలు: పర్రెడ పంచాయతీ పెద్దాపుట్టు ఘాట్ రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. ముంచంగిపుట్టు మండలం దూలిపుట్టు గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో పరామర్శించేందుకు ముంచంగిపుట్టు మండలం కిలగాడ పంచాయతీ చెరువుపాకలనుంచి ఆటోలో 15 మంది శుక్రవారం ఉదయం బయలుదేరారు. పెద్దాపుట్టు ఘాట్‌రోడ్డు దిగుతుండగా ఒక్క సారిగా ఆటో బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటో కింద చిక్కుకొని సూకురు సుబ్బారావు(54) అక్కడికక్కడే మృతి చెందాడు. 12 మంది గాయపడ్డారు. వీరిలో గెమ్మెలి కాసులమ్మ, బట్టి బుల్లమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఆటోలో ప్రయాణిస్తున్న మూడు నెలల బాలుడు, మూడేళ్ల పాప సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. క్షతగాత్రులను రూడకోట పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. సుబ్బారావు మృతితో చెరువుపాకలు గ్రామంలో విషాదం అలముకుంది. మృతుడికి భార్య,నలుగురు పిల్లలున్నారు. పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.